కమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నాన బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ (ఆరో రోజు బతుకమ్మ ఆడరు), వేపకాయ బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ.. పండగన్ని రోజులు తీరొక్క చీరగట్టింది. రంగురంగుల పూలతోని భక్తిగా బతుకమ్మను పేర్చింది. రోజుకో నైవేద్యం పెట్టింది. తమ్మునికి బుద్ధిమాటలు చెప్పింది. నాయిన కాళ్లు పట్టింది. అమ్మ తలకు నూనె రాసి కొప్పుపెట్టింది. అందరితో ప్రేమగా మాట్లాడింది. ఆట పాటలతో అందరినీ సంతోషపెట్టింది. కానీ, గుండెల్లో రగిలే నిప్పుల కొలిమిని, మనసులో ఆగని దుఃఖపు ముసురును, మళ్లీ ఆడలేని బతుకమ్మను, ఆడకుండానే ఓడిపోయిన బతుకును.. తలచినప్పుడల్లా రంగులు మారే మొఖాన్ని, నవ్వుల బుర్ఖా చాటుకు నెట్టేసింది గౌరి.

''బిడ్డా.. దవాఖానకు పోదామానే?'' అని తల్లి ఎన్ని సార్లన్నా..

''సద్దుల బతుకమ్మ తెల్లారి పోదాంతీ!''.. అని నచ్చచెప్పింది గౌరి.

ఆ ఖర్చు సుత తన ఆఖరి పయానానికి అక్కరకొత్తయని మదిల తలిచింది.

ఆరోజు సద్దుల బతుకమ్మ. అందని కొమ్మల తంగేడు పూలు, అంతులేని లోతుల తామరలు, కలువలు, గౌరమ్మకు ఇష్టమైన గుమ్మడిపూలు, దేవుండ్లకు ఇష్టమైన మందారాలు, పొన్నలు, పొగడలు, సీతమ్మ జడలు, గునుగుపూలు, బంతులు, చేమంతులు, గోరింటలు.. అన్నిటిని బీరాకులు పరిచిన పెద్ద తాంబాళంలో దొంతులుగా పెట్టి.. బతుకమ్మను పేర్చి, బతుకమ్మ శిఖరాన పసుపుతో గౌరమ్మను చేసి అలంకరించింది. దేవుని దగ్గర బతుకమ్మను పెట్టి సత్తుపిండి, పెరుగన్నం, పులిహోర, మలీద ముద్దలు, కొబ్బరన్నం, నువ్వులన్నం నైవేద్యంగా పెట్టి, కొబ్బరికాయ కొట్టి హారతిచ్చింది గౌరి.

అమ్మ, నాయినల కాళ్లకు మనసారా మొక్కింది.

'అమ్మ, నాయినల రుణం తీర్చుకోకుండానే ఎల్లిపోతాన! మళ్లీ జన్మంటే కొడుగ్గానో, ఎద్దుగానో, నాగలిగానో మీ ఇంట్ల పుట్టి రుణం తీర్చుకుంట!' అనుకుంది.

గౌరిని చూసిన తల్లి.. తనదిష్టే బిడ్డకు తగుల్తదని, గౌరి అరికాలికి దిష్టిబొట్టు పెట్టింది. రెండుచేతులతో తల నిమిరి మెటికలు విరిచింది. వేళ్లు పటుక్కున విరిగాయి.

గౌరి పేర్చిన బతుకమ్మ సద్దుల పండుగకే వన్నె తెచ్చింది. ఈఏడు ఊళ్లె గౌరిదే పెద్ద బతుకమ్మ. భూలక్ష్మి పిల్ల బతుకమ్మను, గౌరి తల్లి బతుకమ్మను తలకెత్తుకున్నారు. నైవేద్యాల గిన్నెతో తమ్ముడు తోడునడవంగా.. డప్పు చప్పుళ్లతో, వాడకట్టు బతుకమ్మలన్నీ వెంట నడువంగ.. దివినుండి దిగిన అప్సరసలా నడుస్తూ.. దేవునిగుడి దగ్గర సద్దుల బతుకమ్మ ఆఖరి ఆటకు

**అవునూ.. నేను చస్తేనే ఈ సమస్య తీరిపోద్దా?.. నా దినాలు తిరగకముందే వాడు మళ్లో పెళ్లి చేసుకుంటడు. పిల్లలు పుట్టరని బాధతో ఆత్మహత్య చేసుకుందని నామీద నిందమోపుతడు. అందరూ గదే నిజమని నమ్ముతరు. ఆ తరువాత ఇంకో అమాయకురాలు బలిపీఠం ఎక్కుతది. దాని బతుకూ గింతే. మరివాడు ఆడేసులోడైనా.. మొగేశం ఏసుకొని దొరలా బతుకుతడు. మరి ఆని తప్పులకు శిక్షలేదా!?**

బైలెల్లింది గౌరి.

డప్పు చప్పుళ్లు, చుట్టూ జనాలు.. రేపుకూడా ఇంతేగా..? ఇప్పుడు సంతోషంగా నడిచే ఈళ్లందరూ రేపు నన్ను గుర్తు చేసుకుంటూ.. ఏడుస్తూ నడుస్తరు. నాయిన నా ముంగట నడుస్తడు. ఇవన్నీ అప్పుడు నాకు అగుపడవు.. ఈ ఆలోచనలు మనసులో ముసరగానే గౌరి కండ్లు నీటి చెలిమలైనయి.

ఆ పొద్దు ఎన్నడూ ఆడని బతుకమ్మ ఆడింది గౌరి. ఎప్పుడూ గొంతిప్పని గౌరి.. ఎన్నెన్ని పాటలు పాడిందో! దోస్తులతో కూడి దస్తిబిస్తి ఆడింది. చెమ్మచెక్కలాడింది. జంటలుగా విడిపోయి ఎదురుకోళ్లాడింది. కూసోని కాళ్లతో ఆడే తుమ్మెస ఆడింది. అలిసిపోయేదాక ఆడి పాడి.. అందరితో కలిసి బతుకమ్మను సాగనంపనీకి పెద్ద చెరువుకు చేరుకుంది గౌరి.

అమ్మా, నాయిన, తమ్ముడు సాయం పట్టంగా.. బతుకమ్మతో చెర్ల దిగింది.

పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా.. ఇచ్చుకుంట వాయినం, పుచ్చుకుంటి వాయినం.. జోరుగా సాగే బతుకమ్మ పాటలు, మంగళహారతులు, వాయినాల పాటలతో రేవంతా సందడిగా ఉంది. దీపాలతో తేలే బతుకమ్మలతో చెరువు వెలుగుపూల తోటలా కనిపిస్తాంది.

పిల్ల బతుకమ్మను విడిచి, అందరూ కలిసి పెద్ద బతుకమ్మను కొంచెం లోతుకు వెళ్లి విడిచి పెడుతున్నారు.

'గౌరమ్మా.. నీతోపాటు నన్నూ గంగలో కలుపు తల్లీ!' అని గౌరమ్మకు మొక్కి..

'నీ దీపం కొండెక్కక ముందే.. నా దీపాన్ని కొండెక్కించు తల్లీ!' అని మనసులో చివరిసారి మొక్కుకుంది.

అవ్వ మొఖం చూసింది. పిచ్చితల్లి బిడ్డ చానా సంతోషంగా ఉందని అమాయకంగా మురిసిపోతాంది. తండ్రి కళ్లల్లో ఎన్నడూ కనపడని సంబురం, తమ్మునిది ఆట గోలు పసితనం అయినా.. నీనేడ పడ్తనోనని చేయి గట్టిగా పట్టుకుండు. భర్త గుర్తొచ్చిండు..

'అరేయ్.. లం... కొడుక! నా జీవితాన్ని ఎందుకు నాశనం చేసినవురా!' అని గట్టిగా అరవాలనిపించింది.

'సంసారానికి పనికి రానోనివి ఆడపిల్ల జీవితంతోని ఎందుకు ఆడుకుంటున్నవురా?' అని అడగాలనిపించింది.

'అవునూ.. నేను చస్తేనే ఈ సమస్య తీరిపోద్దా?.. నా దినాలు తిరగకముందే వాడు మళ్లో పెళ్లి చేసుకుంటడు. పిల్లలు పుట్టరని బాధతో ఆత్మహత్య చేసుకుందని నామీద నిందమోపుతడు. అందరూ గదే నిజమని నమ్ముతరు. ఆ తరువాత ఇంకో అమాయకురాలు బలిపీఠం ఎక్కుతది. దాని బతుకూ గింతే. మరివాడు ఆడేసులోడైనా.. మొగేశం ఏసుకొని దొరలా బతుకుతడు. మరి ఆని తప్పులకు శిక్షలేదా!? తప్పు చేసినోడేమో తలెగరేసి పొగరుతోని బతుకుతుంటే.. ఏ తప్పూ చేయని నేనెందుకు సావాలి? లేదు.. లేదు.. సావొద్దు! తెగబడి కొట్లాడ్తా? ఆడదంటే నీళ్లల్ల కరిగిపోయే గౌరమ్మ గాదు.. నీళ్లల్ల సుత మంటలు పుట్టించే భద్రకాళి అనిపిస్తా! గిట్ల భయపడి నిందలు మోసి సావడానికేనా నేను పుట్టింది!? లేదు.. నేను బతుకుతా! నన్ను ఏడిపించిన అందరినీ నలుగుట్టెకు గుంజుతా! ఆల్లందరి అసలు రంగు బైటికి ఇగ్గి సూపెడ్తా!' అనుకుంది.

ఇట్ల గౌరి మనసులో ఆలోచనల తర్కం చావునుండి బతుకు మీదికి మళ్లింది. ఇది చాలు.. చచ్చిపోవాలి అనుకున్నవారికి ఒక్కక్షణం ఆలోచన మారితే ఇక చావమన్నా చావరు! అదే జరిగింది ఇక్కడ.

'లేదు! ఈ నీళ్లలో పడి కుళ్లిపోయి సావడం కంటే.. కొట్లాడి సస్తా! అమ్మకు, నాయినకు తోడై.. తమ్ముణ్ని గొప్పోణ్ని చేసి కుటుంబాన్ని రేవుకు తెస్తా!'..

ఈ ఆలోచన రాగానే గౌరి గుండె వేగం తగ్గింది. కాలు వెనక్కి పడింది. తల్లి బతుకమ్మ నీటి తెమ్మెరలపై తూగుతూ.. ఊయలలూగుతూ నిశ్చలంగా నదిలో పోతాంది. గౌరి మనసు కూడా ఆలోచన బరువులను దులుపుకొని నిమ్మలపడుతాంది. తమ్ముడు చెయ్యి వదలకుండా గట్టిగా పట్టుకున్నాడు.

'ఏదెట్లయినా.. ఇగ అన్యాయానికి ఎదురుమళ్లుతా! అవసరమైతే ఊరిని, తనవాళ్లను కూడగట్టుకొని ధైర్యంగా నిలబడి కొట్లాడుతా! మాంటే పానం పోతది గంతే! అట్లా సచ్చే బదులు గిట్ల సస్తా! సావుకు భయపడి రోజు సావడం కంటే.. సంపుతా అన్నోణ్ణే సంపి బొంద పెడ్త! మొగని ముసుగేసుకున్న మొగోడుకాని ఆనికి బుద్ధి చెప్తా!' అని ధైర్యంగా ముందడుగు వేయడానికి నిశ్చయించుకొని, నీళ్లలో వెనకడుగు వేసింది గౌరి.

ముందుకు నడుస్తున్న తండ్రి చేయిని గట్టిగా పట్టుకుంది.

'నాయినా! నన్నే నీ పెద్ద కొడుకుననుకో!' అనుకుంది.

నీళ్లలో నెమ్మదిగా నడిచే అమ్మ భుజం చుట్టూ చెయ్యివేసి ఆసరాగా తోడై నడిచింది.

తమ్ముడు గెంతుతూ ముందు నడుస్తున్నాడు.

ఎక్కడలేని ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ఇంటివైపు అడుగులు వేసింది గౌరి.

దూరంగా కదిలే పెద్ద బతుకమ్మ అటూఇటూ ఊగుతూ.. ఆశీర్వదిస్తున్నట్లు, కొండెక్కని గౌరమ్మ దీపం చీకట్లో దారి చూపిస్తున్నట్లు తోచింది. ■

## మౌనిక సుదర్శనం



సమస్య వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలే తప్ప.. భయపడి చావడం పరిష్కారం కాదని 'కొండెక్కని దీపం' కథ ద్వారా సందేశం ఇస్తున్నారు యువ రచయిత్రి మౌనిక సుదర్శనం. వీరి స్వస్థలం హైదరాబాద్. ఎంఎస్ (ఐటీ) చేశారు. ప్రస్తుతం జేపీ మోర్గాన్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తున్నారు. తండ్రి ప్రముఖ రచయిత రంగనాథ్ సుదర్శనం. ఆయన కథలకు తనే మొదటి పాఠకురాలు. ఆ ప్రభావంతోనే రచనా రంగంలోకి వచ్చారు. 'కొండెక్కని దీపం'.. వీరి తొలి కథ. ఈ రచనకు ఆలోచన మాత్రమే తనదనీ, కథకు బతుకమ్మ పండుగ నేపథ్యంతోపాటు తెలంగాణ మాండలికంలో తీసుకురావడం వెనక తన తండ్రి కృషి ఎంతో ఉన్నదని చెబుతున్నారు రచయిత్రి. ఈ కథ క్రెడిట్ మొత్తం ఆయనదేనని అంటున్నారు. తొలికథకు బహుమతి అందించి ప్రోత్సహించిన నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీపీఠం కథల పోటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు చెబుతున్నారు.